


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 22-02-2023 సంపుటి : 04 సంచిక : 157 పేజీలు : 4 వెల : రూ 3-00


## దేశం ఏదైనా కష్టాల్లో ఉంటే మానవత్వంతో సాయం చేయడమే భారత విధానం



### ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ ఫిబ్రవరి 21 ప్రపంచమంతా ఒకటే కుటుంబమని, ఎవరికి ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇతరులకు సాయం చేసేవారు నిస్వార్థులని, ఇది వ్యక్తులకే కాకుండా దేశాలకు కూడా వర్తిస్తుందని చెప్పారు. అనేక సంవత్సరాలుగా భారత్ నిస్వార్థంగా సాయం చేస్తూ మంచి పేరు తెచ్చుకుందని చెప్పారు. దేశం ఏదైనా కష్టాల్లో ఉంటే మానవత్వంతో సాయం చేయడమే భారత విధానమన్నారు. తుర్కియేసిరియాల్లో భూకంప బాధితులకు సేవలు అందించి వచ్చిన భారత సహాయక బృందాలతో ప్రధాని ఢిల్లీలోని తన నివాసంలో సమావేశమయ్యారు. రెండు దేశాల్లో వారు 10 రోజుల పాటు అందించిన సేవలను ప్రధాని కొనియాడారు. గతంలో ఆఫ్ఘనిస్థాన్, ఉక్రెయిన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవుల్లోనూ భారత సహాయక బృందాలు విశేష సేవలందించాయని మోదీ కీర్తించారు. డాగ్ స్క్వాడ్ సామర్థ్యం పెరిగిందని మోదీ చెప్పారు. గుజరాత్ భూకంపవేళ 2001లో తాను వాలంటీర్‌గా సేవలందించానని, ఆ సమయంలో సేవలు ఎంత కష్టమో తనకు తెలుసన్నారు. విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న దేశాల్లో భారత జెండాతో సహాయక బృందాలు రాగానే బాధిత దేశాల ప్రజల్లో భరోసా పెరుగుతోందని, ఎన్డీఆర్ఎఫ్ కీర్తి నలుదిశలా వ్యాపిస్తోందని ప్రధాని ప్రశంసించారు. తుర్కియేసిరియాల్లో సేవలు ముగించుకుని భారత బృందాలన్నీ నిన్ననే న్యూఢిల్లీ చేరుకున్నాయి. నిన్న భారత బృందాలు స్వదేశానికి వస్తుండగా తుర్కియే సిరియాల్లో చాలా చోట్లా ప్రజలు చప్పట్లతో స్వాగతించారు. వరుసగా నిల్చుని చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొందరైతే భారత సహాయక బృందాల వారితో ఆటోగ్రాఫ్‌లు కూడా తీసుకున్నారు. తుర్కియే, సిరియాల్లో రెండు వారాల క్రితం 7.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. భూకంపం ధాటికి లక్షల ఇళ్లు, భవనాలు నేల కూలాయి. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకొని 46 వేల మందికి పైగా మృత్యువాత పడ్డారు. భూకంపం సంభవించిన వెంటనే ఆపరేషన్ దోస్త్ పేరిట భారత ప్రభుత్వం సహాయక బృందాలతో పాటు సహాయక సామాగ్రిని, ఔషదాలను పంపింది. డాగ్ స్క్వాడ్‌లను కూడా పంపించింది. నుర్దాగీ, అంటక్యా ప్రాంతాల్లో 12 రోజుల పాటు భారత సహాయక బృందాలు సేవలందించాయి. ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు భారత సైన్యం కూడా వైద్య సేవల్లో పాలుపంచుకుంది. గాయపడ్డవారికి సైనిక డాక్టర్లు, నర్సులు సేవలందించారు. అనేకమంది ప్రాణాలు కాపాడారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అయితే రేయింబవళ్లూ శిథిలాలను తొలగిస్తూ అనేకమందిని కాపాడారు. తుర్కియే, సిరియా దేశాల సిబ్బందితో పాటు స్థానికుల సహకారం కూడా తీసుకుని అనేక మంది ప్రాణాలను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. భారత సహాయక బృందాల సేవలను ఐక్యరాజ్యసమితి సహా అనేక దేశాలు మెచ్చుకున్నాయి. కష్టకాలంలో సత్వరమే స్పందించి సహాయక బృందాలను పంపినందుకు తుర్కియే, సిరియా భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపాయి. భూకంపవేళ రావాలనుకున్న పాక్ ప్రధానిని తుర్కియే వద్దంది.

## రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం, వాత్సల్యం అందించారు

### సీఎంజగన్ మోహన్ రెడ్డి
### గవర్నర్ బిశ్వభూషణ్ కు ఆత్మీయ వీడ్కోలు



విజయవాడ ఎ కన్వెన్షన్ సెంటర్లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్కు ఏపీ ప్రభుత్వం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించింది. గవర్నర్ ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి సీఎం వైయస్.జగన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సీఎం మాట్లాడుతూ బిశ్వభూషన్ హరిచందన్ కు కి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున, ప్రభుత్వం తరపున, నా తరపున అభినందనలుతో పాటు ధన్యవాదాలు కూడా తెలుపుతున్నాను. చత్తీస్ఘడ్ గవర్నర్గా వెళ్తున్నందుకు అభినందనలు. ధ్రప్రదేశ్లో ఒక ఆత్మీయుడైన పెద్దమనిషిగా, గవర్నర్ వ్యవస్ధకు ఒక నిండుతనం తీసుకువచ్చినందుకు ధన్యవాదాలని అన్నారు. హరిచందన్ రు గవర్నర్గా ఉన్న ఈ మూడు సంవత్సరాల కాలంలో రాజ్యాంగ వ్యవస్థల మధ్య ఉండాల్సిన సమన్వయం అన్నది ఎలా ఉండాలో ఆచరణలో గొప్పగా చూపించారు. గవర్నర్లకు రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య సంబంధాల మీద ఈ మధ్య కాలంలోనే చాలా సందర్భాలలో వార్తలు చూస్తూనే ఉన్నాం. కానీ మన రాష్ట్రం మాత్రం అందుకు భిన్నంగా, తండ్రిలా, పెద్దలా ఈ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇక్కడి ప్రజా ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తూ మన గవర్నర్ వాత్సల్యం చూపించారని అన్నారు. మన గవర్నర్ విషయాలు క్లుప్తంగా నెమరువేసుకోవాలి. హరిచందన్ గారు ఉన్నత విద్యావేత్త. న్యాయనిపుణులు. వీటన్నింటికీ మించి ఆయన స్వాతంత్ర్య సమరయోధులు కూడా. ఒడిశా ప్రభుత్వంలో నాలుగుసార్లు మంత్రిగా పనిచేసారని అన్నారు. ఐదు సార్లు ఒడిశా అసెంబ్లీకి ఎన్నికైన ఆయన 2000 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్ధిపై 95 వేల మెజార్టీ సాధించి అప్పట్లో ఒక రికార్డు సృష్టించారు. న్యాయవాదిగా కూడా పనిచేసిన బిశ్వభూషణ్ హరిచందన్ ఒడిశా హైకోర్టులో బార్ అసోసియేషన్ యాక్షన్ కమిటీ ఛైర్మన్గా కూడా న్యాయవాదుల సంక్షేమం కోసం, హక్కుల కోసం నిరంతరం పాటుపడ్డారు. బిశ్వభూషణ్ హరిచందన్ కు ప్రతిచోటా కూడా వెన్నుదన్నుగా నిల్చి ఆయన విజయానికి కారణమయ్యారు ఆయన సతీమణి సుప్రవ హరిచందన్. ఆమెకి కూడా ఈ రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వం తరపున, నా కుటుంబం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. చివరిగా దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలతో బిశ్వభూషణ్ హరిచందన్, వారి కుటుంబం నిండు నూరేళ్లు జీవించాలని అందరికీ ఇంకా ఎంతో సేవ చేయాలని మనసారా కోరుకుంటూ.. మీతో మా తీపి జ్ఞాపకాలు మా మనసులో ఎల్లప్పుడూ ఉంటాయని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను అని సీఎం ప్రసంగం ముగించారు. తరువాత ముఖ్యమంత్రి గవర్నర్ ను ఆత్మీయంగా సత్కరించారు.

## కొత్త గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణానికి ముహూర్తం ఖరారు



కృష్ణా: ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కేంద్రం నియమించిన సంగతి తెలిసిందే. ఈ నెల 24వ తేదీన గవర్నర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు రేపు(బుధవారం) అబ్దుల్ నజీర్, ఏపీకి రానున్నారు. సతీసమేతంగా సాయంత్రం ఢిల్లీ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి గన్నవరం ఎయిర్ పోర్టుకి చేరుకుంటారాయన. ఏపీకి మూడో గవర్నర్‌గా సయ్యద్ అబ్దుల్ నజీర్ బాధ్యతలు చేపట్టనున్నారు. కర్ణాటకకు చెందిన అబ్దుల్ నజీర్.. సుప్రీంకోర్టు మాజీ జడ్జి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేయకుండానే.. దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రమోషన్ పొందిన మూడో న్యాయమూర్తిగా ఆయనకు ఓ గుర్తింపు ఉంది. జనవరిలోనే ఆయన పదవీ విరమణ చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నజీర్ పలు కీలక తీర్పులను వెల్లడించారు. ట్రిపుల్ తలాక్, అయోధ్య-బాబ్రీ మసీదు వివాదం, నోట్ల రద్దు, గోప్యత హక్కు వంటి కేసుల్లో తీర్పు వెలువరించిన ధర్మాసనంలో ఆయన ఒకరు. 2017లో వివాదాస్పద ట్రిపుల్ తలాక్ కేసును విచారించిన బహుళ ధర్మాసనంలో జస్టిస్ అబ్దుల్ నజీర్ ఏకైక మైనారిటీ న్యాయమూర్తి.

## మైనారిటీలకు న్యాయం చేస్తాం

తిరుపతి శ్రీకాళహస్తిలో మైనారిటీలతో నారా లోకేష్ సమావేశం అయ్యారు. సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూమైనారిటీల్లో పేదరికం ఎక్కువగా ఉంది. ఇది ఎన్టీఆర్ ఆనాడే గుర్తించి మైనారిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మైనారిటీ కార్పొరేషన్ కొనసాగింది.. కానీ జగన్ రెడ్డి వచ్చాక తీసేశారు. తిరుపతి పార్లమెంట్ లో మహిళలకు రెసిరెన్షియల్ కాలేజీ ఏర్పాటు చేస్తాం. పాదయాత్రలో జగన్ ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు..అమలు చేయలేదు. కానీ మేము ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తాం..మేనిఫెస్టోలో పెడతామని అన్నారు. ముస్లింలకు పని చేసి పెట్టింది టీడీపీ..ఉత్తుత్తి హామీలు ఇచ్చింది వైసీపీ. హజ్ యాత్రకు సహాయం చేసాం. ఇమామ్ లకు



రూ.5 వేలు, మౌజామ్ లకు రూ.3వేలు ఇచ్చాం. రంజాన్ పండుగకు తోఫా కూడా ఇచ్చాం. కానీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా చంద్రబాబు పెట్టిన పథకాలు ఈ సీఎం తొలగించారు. పప్పుబెల్లాలు ఇచ్చే చేతులు దులుపుకునే వాళ్లం కాదు. ఎందుకు బానిసలుగా ఉండాలి.? ఎందుకు మీరు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వెళ్లకూడదు.? పార్టీ ఆలోచన ఒక్కటే..మైనారిటీ సోదరులకు ఏపీఐఐసీ ఇండస్ట్రీయల్ క్లస్టర్ లో స్థానం కల్పించి, మీరే ఉద్యోగాలు కల్పించేలా విధానాలు రూపొందిస్తామని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ముస్లింలపై దాడులు పెరిగాయి. ముస్లింలు భయంతో బతుకుతున్నారు. రోజుకో భూమిని కబ్జా చేస్తుంటే భూములు ఎక్కడ మిగులుతాయి.? మైనారిటీలకు ఇచ్చిన భూములు లాక్కుంటే ఎలా.? బియ్యపు మధుసూదన్ రెడ్డి బడా చోర్. ముస్లింల సంక్షేమ కార్యక్రమాలు కుదించింది జగనే. మా కంటే ముందున్న ప్రభుత్వాలు తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు మేము తొలగించలేదు. ఇంకా అదనంగా అందించాం. మసీదు మరమ్మతులకు కూడా నిధులు కేటాయించాం. షాదీ ఖానాలు కూడా నిర్మించాం. ముస్లింలకు ఎవరు ఏం చేశారో..చర్చించేందుకు సిద్ధం. ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేసింది చంద్రబాబే. ఉర్దూ టీచర్లకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాం. ఫరూక్ కు మంత్రి పదవి, షరీఫ్ కు మండలి చైర్మన్ పదవి ఇచ్చాం. షరీఫ్ ను మండలిలో కొట్టి వైసీపీ అవమానించింది. ముస్లింల రిజర్వేషన్ల కోసం అధికార పార్టీ పోరాడకుంటే సొంత నిధులు ఖర్చు పెట్టి మేము పోరాడుతున్నాం. రెసిడెన్షియల్ కాలేజీ కేటాయించింది పనులు ప్రారంభిస్తే ఈ ప్రభుత్వం నిలిపేసిందని అన్నారు. ముస్లింలు ఎక్కువగా ఉన్న పార్లమెంట్ పరిధిలో మహిళా రెసిరెన్షియల్ కాలేజీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది..చేస్తాం. యువత గంజాయి మత్తులో ఉంది. ప్రతి గ్రామంలో గంజాయి ఉంది. ఉడ్తా పంజాబ్ చూశాం..ఇప్పుడు ఉడ్తా ఏపీ చూస్తున్నాం. సీఎం నివాసం పరిధిలోనే గంజాయి ఎక్కువగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్, స్వయం ఉపాధి రంగాల ద్వారా ముస్లింలకు అవకాశాలు కల్పిస్తాం. హాజీరా అనే యువతిని కర్నూలు జిల్లాలో చంపేశారు. పలమనేరులో మిష్బాను బెదిరించడంతో చనిపోయింది. ముస్లింలు విద్యార్థులు బాగా చదవకూడదా.? శ్రీకాళహస్తిలో నిర్మించిన టిడ్కో ఇళ్లలో 20 శాతం మైనారిటీలకు ఇస్తాం. మైనారిటీ కార్పొరేషన్ మళ్లీ ఏర్పాటు చేస్తాం. 31 మంది వైసీపీ ఎంపీలు పార్లమెంట్ లో ఉన్నారు..కానీ ఎన్.ఆర్.సీ, సీఏఏ గురించి మేమే మాట్లాడాం. ప్రభుత్వ షరతులతో దుల్హన్ 90 శాతం మందికి రాదు. 2014 నుండి 2019 వరకు ముస్లింలపై దాడులు జరిగాయా.? ఈ ప్రభుత్వం ఐదుగురికి పదవులు ఇస్తే ముస్లింలకు న్యాయం జరగదని అన్నారు. ఇంట్లో వృద్ధులు ఉన్నా..ఒంటరి మహిళలు ఉన్నా చంద్రబాబు పెన్షన్ ఇచ్చారు. కానీ ఈ ప్రభుత్వం ఒకరికే ఇస్తోంది. బీడీ కార్మికుల భవిష్యత్ పై ఆలోచిస్తాం. ముస్లింలను టీడీపీ ఏ విధంగా ఆదుకుంది, చూసుకుంది ఒక్కసారి ఆలోచించాలి. ముస్లింల రాజకీయ ఎదుగుదల వెనక టీడీపీ ఉంది. వచ్చేది టీడీపీ ప్రభుత్వమే..రాగానే ముస్లింలకు ఇచ్చిన హామీలు మూడేళ్లలోపే అమలు చేస్తామని లోకేష్ అన్నారు.

## నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ఏపీ ప్రజలను మరవను: బిశ్వభూషణ్ హరిచందన్



విజయవాడ: గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు ఏపీ ప్రభుత్వం మంగళవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేసింది. విజయవాడ ఎ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. సీఎం జగన్ చూపిన గౌరవం, ఆప్యాయత మరువలేనివని తెలిపారు. గవర్నర్, సీఎం సంబంధాలు ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. సీఎం జగన్ అందరికీ సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని అన్నారు. 'ఇన్ని సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తారని ప్రారంభంలో అడిగా. దేవుడి దయతో అన్నీ పూర్తవుతాయని సీఎం జగన్ చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయి. వ్యవసాయ రంగంలో అన్ని రాష్ట్రాల కంటే ఏపీ ముందుంది. ప్రజలు అందించిన ప్రేమ, అభిమానం, సహకారం ఎంతో అద్భుతమైనది. కరోనా కాలంలో ఏపీలోని వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు ప్రాణాలకు తెగించి సేవలు అందించారు. సీఎం జగన్‌ను నా కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నా. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నా రెండో ఇల్లు. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ఏపీ ప్రజలను మరవను' అని గవర్నర్ ప్రసంగించారు. కాగా బిశ్వభూషణ్ హరిచందన్ ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. మూడున్నర సంవత్సరాల పాటు ఆయన ఏపీ గవర్నర్‌గా సేవలందించారు.



## ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సీఎం జగన్ దిక్సూచి: ఎంపీ మార్గాని భరత్

తాడేపల్లి: ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. చంద్రబాబు హయాంలో వెనుకబడిన



వర్గాలకు 30 శాతం మాత్రమే అవకాశం ఇచ్చారని, అయితే పదవుల్లో బలహీనవర్గాలకు 68 శాతం అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. బీసీలను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని, ఆయనది పెత్తందారీ వ్యవస్థ విధానమని ధ్వజమెత్తారు. బలహీనవర్గాలు ఎప్పుడూ వెనుకే ఉండాలనే కాన్సెప్ట్‌తో చంద్రబాబు వ్యవహరించేవాడని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సీఎం జగన్ దిక్సూచని, ఆయన గురించి మాట్లాడే అర్హత లోకేష్‌కు లేదని మండిపడ్డారు.

## మాజీ మంత్రి నారాయణపై తొందరపాటు చర్యలొద్దు: ఏపీ హైకోర్టు

అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలో అసైన్డ్ భూముల కొనుగోలు ఆరోపణల నేపథ్యంలో 2020లో సీఐడీ నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి నారాయణపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఏపీ హైకోర్టు ఆదేశించింది. 41ఏ నిబంధనలు అనుసరించాలని సీఐడీ పోలీసులకు స్పష్టం చేసింది. ఈమేరకు న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ 3 వారాలకు వాయిదా వేసింది. రాజధాని ప్రాంతంలో అసైన్డ్ భూములను కొనుగోలు చేశారనే ఆరోపణలతో వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ 2020లో కేసు నమోదు చేసింది. సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ మంత్రి నారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



# సంపాదకీయం

బుధవారం 22-02-2023

## ఊపందుకొంటున్న విలీన ఉద్యమం

నిర్బంధం, వివక్ష, అభివృద్ధి లేమి.. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్(పీవోకే) లో భారత అనుకూల ఆందోళనలకు దారి తీశాయి. అసలే ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి, దివాళా తీసిన పాకిస్థాన్ ఇప్పుడు వేర్పాటు ఉద్యమం.. కాదు కాదు పీవోకేలో భారత్ లో విలీనం డిమాండ్ లో విలీన ఉద్యమం తారస్థాయికి చేరింది. 1947లో జమ్ము-కశ్మీర్ నుంచి కొంత భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించుకుంది. ఆ ప్రాంతాన్నే పాక్ ఆక్రమిత కాశ్మీర్ గా పిలుస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పాకిస్థాన్ ఆజాద్ కాశ్మీర్, గిల్గిట్ బాల్టిస్థాన్ గా విభజించింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ జనాభా (అజాద్ కశ్మీర్, గిల్గిత్ బాల్టిస్థాన్) 2020 నాటికి దాదాపు 52 లక్షలు. 1947కు ముందు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ కూడా జమ్మూ-కశ్మీర్లో భామే. పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని రెండు భాగాలలో ఒకటైనగిల్గిట్ బాల్టిస్టాన్ లో భారత్ లో విలీనం డిమాండ్ తో జనం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. విభజన సమయంలో, జమ్మూ కశ్మీర్ భారతదేశం లేదా పాకిస్థాన్లో చేరాలా అనే అంశంపై ఆనాటి పాలకుడు మహారాజా హరిసింగ్ దానిని స్వతంత్ర దేశంగా ఉంచాలని నిర్ణయించుకున్నారు. అయితే జమ్ము-కశ్మీర్ లో శాంతియుత పరిస్థితులు పునరుద్ధరణ తరువాత ఆ ప్రాంతం విలీనం గురించి ప్రజాభిప్రాయం ప్రకారం నడుచుకోవాలని అప్పటి భారత గవర్నర్ జనరల్ మౌంట్ బాటిన్ సూచన మేరకు ప్రయత్నాలు జరిగినా.. అది జరగలేదు. అనంతరం హరిసింగ్ 1947 అక్టోబర్ లో ఇన్స్టుమెంట్ ఆఫ్ అక్సెషన్ కు గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బాటన్ ఆమోదంతోనే కాశ్మీర్ వివాదానికి బీజం పడింది. పాకిస్థాన్ దివాళా అంచున ఉంది. విదేశీ అప్పులను చెల్లించలేకపోతోంది. ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది అన్న వార్తలు వింటున్నాం మనం అయితే ఆ దేశ రక్షణ శాఖ మంత్రి మాత్రం మనం దివాళా తీసిన దేశంలో బతుకుతున్నాం అని దేశ ప్రజలకు అర్థమయ్యేలా వాస్తవ పరిస్థితి చెప్పేశారు. పాకిస్థాన్ ప్రస్తుతం అసాధారణ స్థాయిలో ఆర్థికఇబ్బందుల్లో కూరుకుపోయింది. కనీస అవసరాల ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. ప్రస్తుతం దేశంలోని విదేశీ కరెన్సీ నిల్వలు మరోమూడు వారాల పాటు మాత్రమే దిగుమతులకు సరిపోతాయి. ఇదిలాఉంటే.. గతంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సాయం పొందిన పాకిస్థాన్..వాయిదాలు కట్టడంలో విఫలం కావడంతో ఐఎమ్ఎఫ్.. నిధుల విడుదల నిలిపివేసినట్టు సమాచారం. పాకిస్థాన్ ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థతో జరిపిన చర్చలు ఫలవంతం కాలేదు. దీంతో పాకిస్థాన్ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ద్రవ్యోల్బణం అసాధారణంగా పెరిగిపోయింది. కనీసం గోధుమలు కొనుక్కోవడానికి కూడా జనం వద్ద డబ్బులు లేవు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశం హద్దును ఎప్పుడో దాటేశాయి. పాకిస్థాన్ దివాళాకు ఆ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలు అయినా కూడా ఇప్పటి వరకూ అక్కడ సుస్థిర ప్రభుత్వం లేదు. దేశంలో ఎన్నికలు జరిగి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడిందని సంతోషపడినంత సేపు కూడా ఆ ప్రజా ప్రభుత్వం స్థిరంగా అధికారం లో కొనసాగిన దాఖలాలు లేవు. అక్కడి ప్రజాస్వామ్యం, ప్రజా ప్రభుత్వాలు కూడా సైన్యాధ్యక్షుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడి ఉందన్నది వాస్తవం. సైనికుల కనుసన్నలలో మెలిగినంత కాలం మాత్రమే పాక్ లో ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉంటుంది. ఎప్పుడైతే స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వాధినేత ప్రయత్నిస్తారో.. ఆ మరుక్షణమే సైనిక తిరుగుబాటుతో ఆ ప్రభుత్వం కూలిపోతుంది. అందుకే అక్కడ సైనిక ప్రభుత్వాలే దీర్ఘకాలం మనుగడ సాగించాయి. స్వాతంత్ర్యం లభించిన దగ్గర నుంచి పాక్‌లో ఇదే పరిస్థితి. పొరుగున ఉన్న దాయాది దేశాన్ని 1948 నుంచి శత్రువుగానే చూడడం, ఎంతసేపూ కశ్మీర్‌ను ఎలా ఆక్ర మించుకుందామనే కుయుక్తులే ఆ దేశ రాజకీయాలకు శాపం అయ్యిందంటే అతిశయోక్తి కాదు. దేశంలో దారిద్ర్యంతో జనం సతమతమౌతున్నా, పట్టించుకోకుండా కాశ్మీర్ ను కబలించడమెలా అని కుట్రలు పన్నడంలో పాకిస్థాన్ పాలకులదీ, సైన్యానిదీ ఏకాభిప్రాయమే. దేశంలో సమస్యలు ఎదురైనప్పుడల్లా వాటి పరిష్కారం కోసం కృషి చేయడం అటుంచి ఆ సమస్యపై నుంచి దేశ ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాశ్మీర్ ను బూచిగా చూపడంలో సైన్యం, ప్రభుత్వాలది ఒకే మాట. ఇదే ఆయుధంతో ఏడున్నర దశాబ్దాలుగా అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాకిస్థాన్ ఏదో రూపంతో భారత్ తో కాలుదువ్వుతూ, యుద్ధం చేస్తూనే వస్తోంది. పాలకులు, సైన్యం అనుసరించిన ఆ వైఖరే పాకిస్థాన్ నేటి దుస్థితికి, ఆ దేశ ప్రజల దీనావస్థలకు కారణమనడంలో సందేహం లేదు. ఏ దేశంపై అయితే నిత్య ద్వేషంగా రగిలిపోయిందో.. ఆ దేశంలోనే విలీనమౌతామంటూ పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలు ఆందోళనకు దిగారు. ఆ ఆందోళనలు అణచివేయలేక, దేశంలో అలజడిని, ప్రజల కష్టాలనూ తీర్చలేక పాకిస్థాన్ సతమతమౌతోంది. ఏడు దశాబ్దాలుగా దోపిడీ, వివక్షలు అనుభవిస్తూ గడిపిన పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలకు భారత్ లో అభివృద్ధి, సంస్కరణలు తమ దయనీయ స్థితి నుంచి విముక్తి పొందే మార్గాన్ని చూపించాయి. తాము ఒకపక్క అనేక సమస్యలతో సతమతమవుతుంటే తమకు పొరుగునే ఉన్న భారత్ లోని కశ్మీర్ అభివృద్ధిలో నడుస్తుండడంతో తాము కూడా భారత్ లో కలవాలన్న కాంక్ష పెరిగింది. అదే వారిని విలీన ఉద్యమానికి ఆకర్షితులను చేస్తున్నది.

# వైసీపీ వర్సెస్ టీడీపీ




విజయవాడ, ఫిబ్రవరి 21, గన్నవరం టీడీపీ కార్యాలయంపై ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు దాడి చేశారంటూ.. ఆయనపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు పట్టుబట్టడం ఈ ఘర్షణలకు కారణమైంది. పోలీసులు చర్యలు తీసుకోకపోతే వైసీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలుగుదేశం నాయకులు హెచ్చరించారు. గన్నవరం పోలీస్ స్టేషన్ ముందు పట్టాభి సహా పలువురు టీడీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీనికి కౌంటర్‌గా ఆందోళన చేపట్టారు వైసీపీ కార్యకర్తలు. వాళ్లంతా టీడీపీ ఆఫీస్‌ను ముట్టడించారు. కొందరు కార్యకర్తలు రాళ్లు రువ్వడం, ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో ఒక్కసారిగా పరిస్థితి అదుపు తప్పింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు టీడీపీ కార్యాలయాన్ని ధ్వసం చేయడమే కాకుండా అక్కడ ఉన్న ఐదు వాహనాలను తగులబెట్టారు. ఈ ఘటనలు గన్నవరంలో బీభత్సం సృష్టించాయి. అయితే వంశీ ప్రోద్భలంతోనే తమ కార్యాలయంపై దాడులతో అద్దాలను, ఫర్నీచర్ ధ్వంసం చేయడమే కాకుండా అక్కడ నిలిపి ఉంచిన వాహనాలను తగులబెట్టారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు రెండు రోజుల నుంచి టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడమే కాకుండా ఘర్షణలకు దిగుతున్నారు. బీసీలపై దాడులు చేయిస్తున్నారంటూ వంశీపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ స్టేషన్‌కు ఎదురుగా వంశీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెండ్రోజుల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌పై ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వ్యక్తిగత విమర్శలు చేశారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నేతలు వంశీపై విమర్శలు చేశారు. వంశీపై విమర్శలు చేయడాన్ని తట్టుకోలేకపోయిన ఆయన అనుచరులు టీడీపీ ఆఫీస్ పై దాడి చేశారు. టీడీపీ నేత దొంతు చిన్నా ఇంటిపై దాడికి ప్రయత్నించారు. పోలీసులు సమక్షంలోనే ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేశారని టీడీపీ ఆరోపిస్తుంది. టీడీపీ ఆఫీస్ పై దాడి చేసి కంప్యూటర్లు, ఫర్నీచర్ ధ్వంసం చేశారని, ఆఫీస్ ఆవరణలో ఉన్న వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇదంతా తాడేపల్లి కుట్ర అని విమర్శించింది. గన్నవరం ఎమ్మెల్యే వంశీకి బుద్ధా వెంకన్న సవాల్ విసిరారు. దమ్ముంటే రేపు మధ్యాహ్నం 12 గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్దకు రావాలన్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనపై ఎమ్మెల్యే వల్లభనేని వంశీ స్పందించారు. గొడవ జరుగుతొందని తెలిసే గన్నవరం వచ్చానన్నారు. నన్ను, కొడాలి నానిని ఇష్టం వచ్చినట్లు టీడీపీ నేతలు బూతులు తిట్టారని వంశీ ఆరోపించారు. గొడవలో నా పాత్ర చాలా చిన్నదని వంశీ అన్నారు. నాపై నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గన్నవరంలో జరిగే ప్రతి విషయానికి నాకు సంబంధంలేదన్నారు. ఈ క్రమంలోనే విజయవాడ ? గన్నవరం జాతీయ రహదారిపై టీడీపీ నేతలు, కార్యకర్తలు ధర్నాకు దిగారు. కాగా, రెండు రోజుల కిందట టీడీపీ నేతలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ. తన గురించి తప్పుగా వాగితే గన్నవరం అంటే ఏమిటో చూపిస్తానన్నారు వంశీ. చంద్రబాబు, లోకేష్‌లకు దమ్ముంటే తనపై పోటీ చేయాలని సవాల్ కూడా చేశారు వంశీ

# మరో వివాదంలో ఏయూ రిజిస్ట్రార్

విశాఖపట్టణం,ఫిబ్రవరి 21, విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ యాజమాన్యంతో వైసీపీ నేతల సమావేశం అయ్యారు. ఏయూ వీసీ ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ వైసీపీ నేతలతో హోటల్‌లో సమావేశం అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిని బలపర్చాలంటూ ప్రచారం చేయాలని వైసీపీ నేతలు కోరారు. ఈ సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి, వైసీపీ నేతలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని హోటల్ వద్ద సీపీఎం నేతలు నిరసన చేపట్టారు. సీపీఎం శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. నిరసన కారులను అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చి 13న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఆదివారం నాడు పోలీస్ పహారాలో దసపల్లా హోటల్ లో వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కి మద్దతుగా సమావేశం ఏర్పాటుచేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో ఏయూ వీసీ, రిజిస్ట్రార్ సమావేశం నిర్వహించారు. బాధ్యత గల పదవుల్లో ఉండి రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా సమావేశాలు ఏర్పాటు చేయడం సరికాదని సీఐటీయూ నేతలు ఆరోపించారు. ఎన్నికల కోడ్ ను ధిక్కరించడమేనని విమర్శించారు. వీసీ, రిజిస్ట్రార్ పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరింది. సమావేశం గురించి తెలుసుకున్న ప్రజాసంఘాల నాయకులు, జిల్లా ఆర్‌డీఓ, డీఆర్‌ఓలకు సమాచారం అందించామని సీఐటీయూ తెలిపింది. అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వస్తామని తెలిపడంతో అక్కడకు చేరుకున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, జిల్లా నాయకులు సుబ్బారావు, చంద్రశేఖర్, విద్యా?ర్థి, యువజన సంఘం నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేశారని ఆరోపించారు. అధికార పదవులో ఉండి ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు పోలీసులు రక్షణగా ఉండటం అధికార దుర్వినియోగమే అవుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఇప్పటికే వైసీపీ తన సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లను, ఆర్‌పీలను వినియోగిస్తున్నా ఎన్నికల కమిషన్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరైంది కాదని సీఐటీయూ మండిపడింది. వీరందర్నీ ఎన్నికల కమిషన్ పరిధిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏయూ వీసీ, రిజిస్ట్రార్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. వైసీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరించాలని కోరింది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలపై ఉమ్మడి ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలతో ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, బూడి ముత్యాల నాయుడు పాల్గొ?న్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రులు వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతం రాజు సుధాకర్ ను గెలిపించాలని పార్టీ నాయకులకు వైవీ సుబ్బారెడ్డి సూచించారు. ఈ ఇరవై రోజులు పార్టీ నాయకులు నియోజక వర్గాల్లో ఓటర్లను కలిసి మెజార్టీ సాధించే దిశలో పనిచేయాలన్నారు. విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని కాలేజ్‌లన్నీ ఏయూ కిందకే వస్తాయి. అందుకే ఆయా జిల్లాల్లోని ప్రైవేట్ కాలేజ్‌ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి.. వైసీపీకి ఓట్లు వేయాలని సూచించినట్లు వామపక్షాలు ఆరోపిస్తున్నాయి.. ఈ అంశంపై ఇప్పటికే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు కూడా చేశాయి. వెంటనే వీసీ ప్రసాదరెడ్డిని విధుల్లోంచి తప్పించాలని డిమాండ్ చేశాయి. అయితే ఈ ఆరోపణలను వైసీపీ ఖండిస్తోంది. చేతకాని వాళ్లే ఇలాంటి ఫిర్యాదులు చేస్తారని ఆరోపించారు మంత్రి బొత్స. ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే.. వీసీని తప్పించాలంటూ విశాఖ కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి.

# అవినాష్ చుట్టూ బిగిస్తున్న ఉచ్చు



కడప, ఫిబ్రవరి 21, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చుట్టూ సీబీఐ ఉచ్చు బిగించిందా.. అంటే వైసీపీ శ్రేణుల నుంచే ఔనన్న మాట వినిపిస్తోంది. ఇప్పటికే ఒక సారి వైఎస్ అవినాష్ రెడ్డిని విచారించిన సీబీఐ తాజాగా మరో సారి విచారణకు పిలిచింది. ఈ సారి ఫిబ్రవరి 25న హైదరాబాద్ సీబీఐ ఆఫీసుకు రావాలని సీబీఐ ఆ నోటీసులలో ఆదేశించింది. అదే సమయంలో ఎంపీ అవినాశ్ రెడ్డి తండ్రి వైఎస్ భాస్కరరెడ్డికి కూడా నోటీసులు జారీ చేసింది. అయితే ఆయన ఎక్కడ విచారణకు హాజరౌతారో చెప్పాలని ఆయనకే ఛాయిస్ ఇచ్చింది. భాస్కరరెడ్డికి నోటీసుల విషయం పక్కన పెడితే.. నెల రోజులు కూడా పూర్తి కాకుండా అవినాష్ రెడ్డిని రెండో సారి విచారణకు పిలవడంతో అవినాష్ ను సీబీఐ అరెస్టు చేస్తుందన్న అభిప్రాయం విస్తృతంగా వ్యక్తం అవుతుంది. తొలి సారి ఆయనను విచారణకు పిలిచిన సందర్భంలోనే అవినాష్ అరెస్టు పై పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఎంపి కనుక అవినాష్ రెడ్డిని అరెస్టు చేయడానికి లోక్ సభ స్పీకర్ అనుమతి కూడా సీబీఐ తీసుకుందని అప్పట్లోనే గట్టిగా వినిపించింది. పైగా ఆనవాయితీకి భిన్నంగా అప్పట్లో ఆయనను సాయంత్రం నాలుగు గంటల సమయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా సీబీఐ ఆదేశించడంతో.. అదే రోజు రాత్రి అయనను అరెస్టు చేసే అవకాశం ఉందని రాజకీయవర్గాలు అంచనా వేశాయి. అయితే అప్పట్లో సీబీఐ ఆయనను అరెస్టు చేయలేదు.. కానీ కీలక విషయాలను ఆయన నుంచి రాబట్టిందని అంటున్నారు. ముఖ్యంగా దర్యాప్తు తాడేపల్లి ప్యాలెస్ చేరుకునేందుకు అవసరమైన కీలక సమాచారం అవినాష్ రెడ్డి నుంచి రాబట్టిన సీబీఐ.. సీఎం జగన్ ఓఎస్డీ, జగన్ సతీమణి భారతి పిఎలను విచారణకు పిలిచి ప్రశ్నించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. వివేకా హత్య ఘటన సాక్ష్యాలు మాయం చేయడం దగ్గర నుంచీ, ఆయన గుండెపోటుతో మరణించారన్న ప్రచారం వరకూ అన్నిటా అవినాష్ రెడ్డి పాత్రే కీలకమనీ సీబీఐ నిర్ధారణకు వచ్చిందని చెబుతున్నారు. వివేకా హత్య కేసు విచారణ ఏపీ నుంచి తెలంగాణకు మారిన క్షణం నుంచీ సీబీఐ దూకుడు పెంచింది. ఏపీలో విచారణ సందర్భంగా ఆ కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్నో అవరోధాలను ఎదుర్కొనడమే కాకుండా.. పలు అపవాదులనూ ఎదుర్కొంది. స్వయంగా దర్యాప్తు సంస్థ అధికారులపైనే కేసులు నమోదయ్యాయి. బెదరింపులూ వచ్చాయి. వీటన్నిటి వెనుకా ఉన్నది వైఎస్ అవినాష్ రెడ్డే నని సీబీఐ నిర్ధారణకు వచ్చిందని చెబుతున్నారు. అందుకే కేసును ఏపీ నుంచి మార్చాలంటూ.. వైఎస్ వివేకా కుమార్తె సునీతారెడ్డి సుప్రీంను ఆశ్రయించిన సందర్భంగా, సీబీఐ కూడా ఏపీ నుంచి కేసు విచారణను మార్చాలనే పేర్కొంది. ఆ సందర్భంగా సుప్రీం కోర్టుకు కేసు దర్యాప్తులో అవరోధాలకు సునీత చెప్పిన ప్రతి కారణమూ అక్షరసత్యమని వాంగ్మూలం కూడా ఇచ్చింది. వివేకా హత్య కేసు దర్యాప్తులో కడప ఎంపీ అవినాష్ రెడ్డి జోక్యం చేసుకుంటున్నారనీ, ఏపీలో నిష్పక్షపాత విచారణ జరుగుతున్న నమ్మకం లేదని, కేసు విచారణ బయట రాష్ట్రాలకు బదిలీ చేయాలని వివేకా కుమార్తె సునీతా రెడ్డి కోరగా, ఈ కేసు విచారిస్తున్న సీబీఐ కూడా సునీత చెప్పిన ప్రతి విషయం అక్షర సత్యమని సుప్రీం కోర్టుకు తెలియజేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టు కేసును తెలంగాణకు బదలీ చేసింది. అంతే అప్పటి వరకూ మందగమనంగా సాగుతున్న సీబీఐ దర్యాప్తు ఒక్కసారిగా జోరందుకుంది. కేసు హైదరాబాద్ కు మారిన తరువాత వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తు జోరందుకోవడమే కాకుండా.. అంతకు మందు కేసు దర్యాప్తు ముందుకు సాగకుండా అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించిందన్న అభిప్రాయాలు కూడా బలపడ్డాయి. ఇక గత జనవరిలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని సీబీఐ విచారించిన తరువాత ఈ హత్య కేసు పాత్ర ధారులే కాకుండా, వెనుక ఉన్న సూత్ర ధారుల విషయం కూడా వెలుగులోనికి వస్తుందన్న భావన సర్వత్రా వ్యక్తం అవుతోంది.

## సోషల్ ఇంజనీరింగ్ తో ఎమ్మెల్సీ పదవులు

విజయవాడ, ఫిబ్రవరి 21, ఎన్నికల వ్యూహానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తెర తీసింది. ఎమ్మెల్సీ కోటాలో పదవుల పంపకాల్లో పక్కాగా సామాజిక వర్గాల సమీకరణాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. టార్గెట్ 175 లో భాగంగా ఏపీ సీఎం వైఎస్ జగన్ వ్యూహాత్మకంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ లో అధికార పార్టీ చెందిన ఆశావహులకు ఎమ్మెల్సీ స్థానాల్లో అవకాశం కల్పిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తూ, ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి నష్టపోయిన విధేయులకు జగన్ ప్రాధాన్యం ఇచ్చారు. అంతే కాదు సామాజిక వర్గాల వారీగా కీలకమయిన అంశం కావటంతో, జగన్ ఆచి తూచి వ్యవహరించినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మెజార్టీ స్థానాలను బీసీ వర్గాలకు కేటాయించారు. ఇప్పటి వరకు సామాజిక కోణంలో పెద్దల సభలో అడుగుపెట్టని కులాలకు సైతం జగన్ అకాశం ఇచ్చారు. దీంతో ఆయా వర్గాలను పూర్తిగా ఆకట్టుకునేందుకు వీలవుతుందని పార్టీ భావిస్తోంది. టార్గెట్ 175 స్థానాల పైనే గంపెడు ఆశలు పెట్టుకున్న జగన్, ఇక రాబోయే రోజులను పూర్తిగా ఎన్నికల కోణంలో నే చూడాలని భావిస్తోందిని, అందులో భాగంగానే ఏడాది ముందుగానే పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలను కేంద్రంగా చేసుకుందనే ప్రచారం జరుగుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్ గా చేసుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే పార్టీ పరంగా ప్రత్యేక గృహ సారథులను రంగంలోకి దింపుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అన్ని వర్గాలను తన వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైసీపీ కీలకమయిన సామాజిక వర్గాలకు పెద్ద పీఠ వేసింది. అందులో భాగంగానే గతంలో ఎన్నడూ ప్రాదాన్యత దక్కని కులాలను వెతికి మరీ ఆయా ఎమ్మెల్సీ స్థానాలను ఆ వర్గాలకు కేటాయించారు సీఎం జగన్. ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన తరవాత సీఎం జగన్ వారితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. గతంలో ఎన్నడూ లేని విదంగా ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్దులను ఎంపిక చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని సీఎం జగన్ వ్యాఖ్యానించారు. పార్టీలో మెదటినుండి పని చేస్తున్న వారికి, కులాల వారీగా వారి శ్రమకు గుర్తింపు ఇస్తూ కీలకమయిన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. 18మందిలో కేవలం నాలుగు స్థానాలు మాత్రమే ఓసీలకు ఇచ్చామని, అధికంగా 14 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి ఇవ్వటం ఆనందంగా ఉందన్నారు జగన్. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి సాహసం చేయలేదని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా అమలు చేశామని, అదే విధంగా సామాజిక వర్గాల కోణంలోనూ రాజకీయంగా అణచివేతకు గురయిన కులాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆయా సామాజిక వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇస్తామన్నారు. బీసీ వర్గాలంటే కేవలం బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్ గా వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ఆయా వర్గాలకు తెలియచేశామని చెప్పారు. రానున్న రోజులు ఆయా వర్గాలు అన్నీ తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు పూర్తిగా సహకరించాలని సీఎం జగన్

## పులి మాంసం తినేశారు

ఒంగోలు, ఫిబ్రవరి 21, పులిని చూడాలి కానీ కలవాలనుకోకు చంపేస్తుంది అనే సినిమా డైలాగుల్ని మనం చాలా విని ఉంటాం. కానీ వాళ్లు పులిని చూడటమే కాదు.. కోసుకుని తిన్నారు. అయితే చంపేసి తిన్నారా.. చచ్చిపోయింది కనిపిస్తే తిన్నారా అన్నది పక్కన పెడితే... పులిని మాంసంగా చేసుకుని పంచుకుని తినేశారు. ఈ ఘటన ప్రకాశం జిల్లాలో చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు ప్రాంతం అటవీ ప్రాంతం. పులులు కూడా తిరుగుతూ ఉంటాయి. అలా ఓ పులి విద్యుత్ కంచెకు తగిలి చనిపోయింది. దీన్ని గమనించిన కొందరు గుట్టుచప్పుడు కాకుండా వండుకు తిన్నారు. పుల్లల చెరువు మండలం అక్కపాలెం అటవీ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ నెల 10న ఎర్రగొండపాలెం ఫారెస్ట్ రేంజ్ అధికారి నీలకంఠేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది ఆడపులి పాదముద్రలను గుర్తించారు. దీంతో పులి ఆచూకీని తెలుసుకునేందుకు అదే రోజు ట్రాప్ కెమెరాలు అమర్చారు. పులి సంచారం గురించి సమీప ప్రాంతాల ప్రజలకు తెలియజేస్తూ ఆరుబయట ఎవరూ నిద్రపోవద్దని హెచ్చరికలు జారీ చేశారు. కానీ అసలు అటవీ సిబ్బందికి తెలియనిదేమిటంటే అప్పటికే అది చనిపోయిందని వండుకుని తినేశారని. తర్వాతా పంటలను కాపాడుకునేందుకు పొలం చుట్టూ రైతులు వేసిన కంచె తగిలి పులి చనిపోయింది. విషయం తెలుసుకున్న కొందరు స్థానికులు పులి మాంసాన్ని వండుకుని తినేశారు. ఈ విషయం అటవీ అధికారులకు తెలియకుండా గుట్టుగా ఉన్నారు. కానీ ఈ పులి మాంసాన్ని పంచుకునే విషయంలో కొంత మందితో విబేధాలు రావడంతో బయటకు పొక్కింది. దీంతో ఫారెస్ట్ అధికారులు విచారణ చేపట్టారు. 12 మంది పులి మాంసం తిన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. పులి మాంసాన్ని పంచుకున్న వారిలో ఇద్దరిని గుర్తించి అటవీ అధికారులు పిలిపించి ప్రశ్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. తల్లి కోసం రెండు పులి కూనలు వెతుకుతున్న దృశ్యాలు ట్రాప్ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీంతో కరెంట్ కంచెకు తగిలి చనిపోయిన పులి.. ఈ కూనల తల్లేనని అటవీ అధికారులు భావిస్తున్నారు. మామూలుగా అయితే ఇలా కరెంట్ తీగలను పెట్టడానికి నిబంధనలు అంగీకరించవు. అయితే తమపై జంతువులు దాడి చేస్తున్నాయని.. పంటలను నాశనం చేస్తున్నాయన్న కారణంగా వీటిని అటవీ ప్రాంతంలోని గ్రామస్తులు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటి వల్ల వన్యప్రాణాలు మృత్యువాత పడుతున్నాయి.

## బ్రిటిషు దుష్టపాలనపై ఎదిరించి తిరుగుబాటు చేసిన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

-నేడు ఆయన వర్ధంతి

భారతదేశంలో తొలి స్వాతంత్ర్య తిరుగుబాటు 1857లో మొదలైంది. కానీ అంతకు పదేళ్ల ముందే బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసిన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. 1846 జూన్ నెలలో మొదలైన నరసింహారెడ్డి తిరుగుబాటు 1847 ఫిబ్రవరిలో ఆయన వీరమరణంతో ముగిసింది. ఈ 8 నెలల కాలంలో బ్రిటీష్ వారిని ముప్పుతిప్పలు పెట్టి.. మూడు కాదు ముప్పై చెరువుల నీళ్లు తాగించాడు నరసింహారెడ్డి. తనకు రావాల్సిన భరణాన్ని ఇవ్వకుండా.. తన అనుచరుడిని అతి దారుణంగా బ్రిటీష్ వాళ్లు చంపేయడంతో వాళ్లపై తిరుగుబాటు చేస్తాడు ఉయ్యాలవాడ. కోయిలకుంట్లతో పాటు మరికొన్ని ధనాగారాలపై తన అనుచరులతో దాడి చేసి.. వాటిని దోచేస్తాడు నరసింహారెడ్డి. ఆ తర్వాత ఆయన కోసం బ్రిటీష్ వాళ్ళు వెతుకుతారు. తనను పట్టుకోవాలని చూసిన బ్రిటీష్ వాళ్లను కూడా చంపేస్తాడు రెడ్డి. అంతేకాకుండా ఎప్పటికప్పుడు వాళ్ల ఖజానాలపై పడి తుపాకులతో పాటు నగదును కూడా దోచుకెళ్లేవాడు ఉయ్యాలవాడ. ఆ రోజుల్లోనే ఉయ్యాలవాడను పట్టుకుంటే 1000 రూపాయల నజరానా ప్రకటించింది బ్రిటీష్ ప్రభుత్వం. దాన్నిబట్టి ఆయన ఎంతగా వాళ్లను భయపెట్టాడో అర్థం చేసుకోవచ్చు.

విభారె




# అసైన్మెంట్ కమిటీ జరిపి తక్షణమే పేదలకు భూ పంపిణీ చేయాలి సిపిఐ

## బద్వేలు మండల కార్యదర్శి నాగ దాసరి ఇమ్మానుయేలు డిమాండ్

బద్వేలు , అసైన్మెంట్ కమిటీ జరిపి దాదాపు పది సంవత్సరాలు కావస్తుంది ఇప్పటివరకు అసైన్మెంట్ కమిటీ జరపకుండా జాప్యం చేయడం సరికాదని తక్షణమే అసైన్మెంట్ కమిటీ జరిపి పేదలకు భూ పంపిణీ చేయాలని సిపిఐ బద్వేల్ మండల కార్యదర్శి నాగ దాసరి ఇమ్మానుయేలు డిమాండ్ చేశారు మంగళవారం ఉదయం 10 గంటలకు అనంతరాజపురం పంచాయతీలోని తిమ్మరాజు పల్లె నక్కలగండి ప్రాంతంలోని భూమిలేని నిరుపేదలతో కలిసి మాట్లాడడం జరిగిందన్నారు ఈ సందర్భంగా ఇమ్మానుయేలు మాట్లాడుతూ ఏండ్ల తరబడి భూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతుంటే అధికారులు పట్టి పట్టినట్లు వ్యవహరించడం వల్ల పేదలు ఇబ్బందులకు గురి అవుతున్నారని వారి ఆవేదన వినే నాధుడే లేక పోవడం చాలా బాధాకరమైన విషయమని ఆయన అన్నారు రాష్ట్ర ప్రభుత్వం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నరకంగా వ్యవహరిస్తూ పేదలకు ఆశ చూపుతూ అసైన్మెంట్ కమిటీ జరుపుతామని గొప్పలకు పోతూ కాలయాపన చేయడం సమంజసం కాదన్నారు నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీలు భూములు లేక సతమతమవుతుంటే ప్రభుత్వం పట్టి పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు నాయకులుగా చలామణి అయ్యే వారు ఎకరాలకు ఎకరాలు ఆక్రమించుకొని కంచెలు వేసుకుంటుంటే చూస్తూ ఉన్న ప్రభుత్వం పేద ప్రజలకు భూ పంపిణీ విషయంలో మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు .తక్షణమే గుర్తింపు కలిగిన పార్టీల నాయకులను గుర్తించి అసైన్మెంట్ కమిటీలో వారిని చేర్చి అసైన్మెంట్ కమిటీ జరిపి ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి చొప్పున భూ పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు భూ సర్వే పేరుతో కాలయాపన చేయకుండా ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడి ప్రభుత్వ భూమిని పేదలకు తక్షణమే ఇచ్చి వారికి న్యాయం చేయాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీ పై స్పష్టమైనటువంటి వైఖరిని ప్రకటించకపోతే పేదలతో దళితులతో కలిపి బద్వేలు ప్రాంతంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిపిఐ బద్వేలు నాయకులు ఓబయ్య కళ్యాణ్ వెంకటయ్య అమరావతి అయ్యవారమ్మ తదితరులు పాల్గొన్నారు



# బ్యాక్ వాటర్ లో అనుమానస్పద స్థితిలో యువకుడు మృతి



బద్వేలు గోపవరం మండలం సోమశిల జలాశయం వెనుక జలాల్లో పొద్దుటూరు పట్టణం సంజీవ నగర్ చెందినచిన్ని రామాంజనేయులు 36 అనే యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు నెల్లూరు జిల్లా సోమేశుల గ్రామానికి చెందిన ఒక చేపల వ్యాపారి రామాంజనేయులు ను 15 రోజుల క్రితం రామాంజనేయులు ను సోమేశుల జలాశయంలో ఆలివ్ వలలు లాగేందుకు తీసుకు రావడం జరిగిందిసోమేశుల బ్యాక్ వాటర్ లో ఎంతోకాలంగా అక్రమ చేపల వేట సాగుతుంది ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే ఆలివ్ వలలు వేసి చేపలు పడుతుంటారు బద్వేల్ లో అక్రమ చేపల వేట చేసేవారు పలువురు ఉన్నారు రామాంజనేయులు కూడా ఆలివ్ వలలు లాగేందుకు ఇక్కడికి రావడం జరిగింది తనకు ఇక్కడ పనిచేయడం ఇష్టం లేదని ఆదివారం సాయంత్రం అతని పిలిపించిన వ్యక్తికి చెప్పడం జరిగింది ఆ తరువాత ఏమైందో గాని సోమవారం సాయంత్రం బ్యాక్ వాటర్ లో రామాంజనేయులు శవమై కనిపించాడు అతని మృతదేహం ఒడ్డుకు కొట్టుకు రావడంతో స్థానికులు వీఆర్వో ఓబులేసుకు సమాచారం ఇచ్చారు వెంటనే బద్వేలు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ కు సమాచారం రావడంతో ఆయన బోటు ద్వారా శవాన్ని బయటికి తీయించారు పోస్టుమార్టం నిమిత్తం రామాంజనేయులు మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసులు కేసు నమోదు చేశారు రామాంజనేయులు మృతి అనుమానస్పదంగా ఉందని స్థానికులు చెబుతున్నారు బ్యాక్ వాటర్ లో ఆలివ్ వలలతో ఎంతో కాలంగా అక్రమ చేపల వేట సాగుతుంది అక్రమ చేపలు వేటకు ఇప్పుడు ఒక వ్యక్తి బలి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది

# నంద్యాల పట్టణ సుందరీకరణకు రంగం సిద్ధం.

## --నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి




నంద్యాల :-..స్థానిక నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన పత్రికల సమావేశంలో నంద్యాల టౌన్ మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి మాట్లాడుతూ, నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పబ్లిక్ ప్రైవేట్ గోడల పైన రోడ్డు డివైడర్లకు రోడ్డు హైలాండ్స్ లకు మరియు ప్రముఖ నాయకుల విగ్రహాల ప్రహరీ గోడల పైన కరపత్రాలు, పోస్టర్లు వాల్ పెయింటింగ్స్ వాణిజ్యపరమైన ప్రకటనలను, మున్సిపల్ నిషేధ చట్టం ప్రకారం 1997 యాక్ట్ నెంబర్ 28 క్రింద ఒక చదరపు అడుగుకి 2000 రూపాయల వరకు జరిమానా లేదా జైలు శిక్ష లేదా రెండును విధించబడునని, అంతేకాకుండా నూనెపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి , మరియు బొమ్మల సత్రం ఫ్లై ఓవర్ బ్రిడ్జి గోడలపై, సినిమా వాల్ పోస్టర్లు, కుల మతాలకు సంబంధించిన పోస్టర్లు కరపత్రాలు, తదితర చేతిప్రతలు, రాసిన పోస్టర్లు అంటించిన పదివేల రూపాయలు జరిమానా జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. కావున కుల సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ మత సంఘాల పెద్దలు, ప్రతి ఒక్కరూ మున్సిపల్ అధికారులకు సహకరించాలని, వారు కోరారు. గౌరవ శాసనసభ సభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి సూచనల మేరకు, పట్టణాన్ని సుందరీ కారణంగా తీర్చిదిద్దాలని దృఢ సంకల్పంతో నంద్యాల పట్టణ సుందరీకరణ కార్యక్రమానికి రంగం సిద్ధం చేసినట్లు కమిషనర్ తెలిపారు.

# పదో తరగతి విద్యార్థినులకు అవగాహనా సదస్సు



డోన్, :పదో తరగతి విద్యార్థినులకు 2023 లో మార్చ్, ఏప్రిల్ జరిగే పబ్లిక్ పరీక్షలపైన అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది, స్థానిక పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల లో ప్రధాన ఉపాధ్యాయురాలు మైమున్నిసా అధ్యక్షత వహించగా, డోన్ డివిజన్ డిప్యూటీ విద్యాధికారి క్రిష్టపర్ ముఖ్య అతిథిగా హాజరై అయన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలు అంటే భయం ఎందుకు, నిర్భయంగా ఉండి ఇష్ట పడి చదివి పరీక్షలు రాయాలి అన్నారు,అనంతరం కర్నూల్ నుంచి మరో ముఖ్య అతిథి గా హాజరైన ప్రభుత్వ డైట్ అధికారి విద్యార్థులకు సబ్జక్ట్స్ లలో సులభంగా మర్క్స్ వచ్చే విధంగా అవగాహనా కల్పించారు, అలాగే కర్నూల్ ప్రతిభ కోచింగ్ సెంటర్ అధినేత అరుణాచలం రెడ్డి విద్యార్థుల లెక్కలు సబ్జెక్టు విషయం సులభంగా ఎలా లెక్కలు చెయ్యాలి, మార్కులు వచ్చే విధంగా అవగాహనా కల్పించి, మంచి మార్కులు రావాలి అనీ తెలిపారు, ఈ కార్యక్రమం లో డిప్యూటీ సీసీ నాయక్, పాఠశాల టీచర్స్ , పదో తరగతి విద్యార్థినులు పాల్గొన్నారు..

# గన్నవరంలో వైసీపీ విధ్వంసం దుర్మార్గమైన చర్య

## ---. ఏవి సుబ్బారెడ్డి.

నంద్యాల :-కృష్ణాజిల్లా గన్నవరం లో వైసిపి కార్యకర్తలు గుండాలు రౌడీలు రెచ్చిపోయి టిడిపి కార్యాలయంలోని వస్తువులను ధ్వంసం చేసి వాహనాలను నిప్పు పెట్టడం దుర్మార్గమైన చర్యగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ సీనియర్ టిడిపి నాయకుడు ఏవి సుబ్బారెడ్డి విమర్శించారు. వైసిపి గుండాలు పోలీసుల సమక్షంలోనే నినాదాలు చేస్తూవిధ్వంసం సృష్టించడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కత్తులు రాడ్లు తీసుకొని వైసిపి రౌడీలు ఇష్టానుసారంగా చేస్తున్న పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం ఏమిటని విమర్శించారు. రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు రక్షణ కరువైందని వైసిపి గుండాలు వారిని టార్గెట్ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. టిడిపి పార్టీ శ్రేణులకు అండగా వెళ్లిన పట్టాభి పై వైసీపీ నాయకులు దాడి చేసి వాహనాన్ని ధ్వంసం చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు పట్టాభిని అదే వాహనంలో పోలీస్ స్టేషన్ కు తరలించి ఎక్కడ ఉంచారో తెలియదని పేర్కొన్నారు రాష్ట్రంలో వైసీపీ ది ప్రజాస్వామ్య పాలన కాదని విధ్వంసపాలనగా అభివర్ణించారు.

# కింగ్ మలయాళ రీమేక్ తో రాబోతున్నారా?



కింగ్ నాగార్జున గత కొంలత కాలంగా సరైన సక్సెస్ ని దక్కించుకోలేకపోతున్నారు. గత ఏడాది 'బంగార్రాజు' మూవీతో ఫరవాలేదనిపించిన నాగార్జున ఆ తరువాత చేసిన 'ది ఘోస్ట్' మూవీపైభారీ అంచనాలు పెట్టుకున్నా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది.ప్రవీణ్ సత్తారు డైరెక్ట్ చేసిన ఈ యాక్షన్ థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలిచి కింగ్ నాగ్ కు షాకిచ్చింది. దీంతో ఆలోచనలో పడిపోయిన నాగార్జున ఈ సారి ఎలాగైనా బిగ్ హిట్ ని సొంతం చేసుకోవాలనే ఆలోచనలో వున్నారు.ఇందులో భాగంగానే వరుస హిట్ లతో మంచి గుర్తింపుని సొంతం చేసుకున్న ప్రసన్న కుమార్ బెజవాడని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఓ భారీ మూవీకి శ్రీకారం చుట్టబోతున్నారని గత కొంత కాలంగా వార్తలు జోరుగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ ని మొదలు పెట్టిన చిత్ర బృందం ఈ మూవీ కోసం మలయాళ హిట్ ఫిల్మ్ ని ఎంచుకున్నారట.మెగాస్టార్ నుంచి పవర్ స్టార్ వరకు మలయాళ రీమేక్ లని ఎంచుకుంటున్న నేపథ్యంలో కింగ్ నాగార్జున కూడా మలయాళ రీమేక్ నే నమ్ముకుంటున్నారట. న్యూ ఢిల్లీ అంతామ తీర్పు వంటి సంచలన చిత్రాల దర్శకుడు జోషీ 2019లో రూపొందించిన మూవీ 'పెరింజు మరియమ్ జోస్'. 2019 ఆగస్టు 23న విడుదలైన ఈ మూవీ అక్కడ సంచలన విజయాన్ని సాధించింది. జోజు జార్జ్ హీరోగా నటించిన ఈ యాక్షన్ డ్రామాని నాగార్జున తెలుగులో చేయబోతున్నారట.ఇప్పటికే రీమేక్ హక్కుల్ని కూడా సొంతం చేసుకున్నారని తెలుగు నేటి విటీకి అనుగుణంగా ప్రసన్న కుమార్ బెజవాడ మార్పులు చేర్పులు చేస్తున్నారని తెలిసింది. వచ్చే నెల నుంచి ఈ మూవీ సెట్స్ పైకి వెళ్లనుందట.విభిన్నమైన యాక్షన్ డ్రామాగా తెరపైకి రానున్న ఈ మూవీలోని ఇతర కీలక పాత్రల్లో అల్లర నరేష్ తో పాటు మరో యంగ్ హీరో రాజ్ తరుణ్ కూడా నటించనున్నట్టుగా తెలుస్తోంది. అల్లర నరేష్ కీలక అతిథి పాత్రలో కనిపిస్తారని ఈ క్యారెక్టర్ సినిమాకు అత్యంత కీలకమని ఇన్ సైడ్ టాక్.త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాల్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించనుందని చెబుతున్నారు. ఇక ఈ మూవీని పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరపైకి తీసుకురానున్నారని నాగార్జున క్యారెక్టర్ కూడా ఇందులో కొత్తగా వుంటుందని చెబుతున్నారు.

# మెగా డాటర్ కు ఫ్లాప్? కుర్ర హీరోకు మరో డిజాస్టర్

యంగ్ హీరో సంతోష్ శోభన్ నిజానికి మంచి టాలెంటెడ్ యాక్టర్ అని చెప్పాలి. నటుడిగా అతనికి నూటికి నూరు మార్కులు ఇవ్వొచ్చు. మంచి టైమింగ్ ఉన్న ఈ జెనరేషన్ యాక్టర్స్ లో సంతోష్ శోభన్ పేరు కూడా చెప్పుకోవాల్సిందే. అయితే ఈ కుర్ర హీరో కథల ఎంపిక విధానంలో మాత్రం తడబడుతున్నాడు. ఏదో పెద్ద నిర్మాతలు పెద్ద ఫ్యామిలీ అని సినిమాలు కమిట్ అవుతున్నాడో లేదంటే అలాంటి కథలనే ఎంపిక చేసుకుంటున్నాడో తెలియదు కాని వరుసగా ఫ్లాప్ లని తన ఖాతాలో వేసుకుంటున్నాడు. ఈ జెనరేషన్ హీరోలు అందరూ కొత్తదనం ఉన్న కథలతో ట్రావెల్ చేస్తూ ఉంటే సంతోష్ శోభన్ మాత్రం రొటీన్ డ్రామాని నమ్ముకొని ప్రేక్షకులని ఎంటర్టైన్ చేయడానికి వస్తున్నాడు.అయితే అతని పెర్ఫార్మెన్స్ కి ప్రేక్షకులు కనెక్ట్ అవుతున్నా సినిమాలో కంటెంట్ లేకపోవడంతో బోర్లా పడుతున్నారు. సంక్రాంతి సందర్భంగా కల్యాణం కమనీయం అనే సినిమాతో సంతోష్ శోభన్ ప్రేక్షకుల ముందుకి వచ్చాడు.ఆ టైంలో వాల్తేర్ వీరయ్య స్పీడ్ లో ఈ యంగ్ హీరో సినిమాని ఎవరూ పట్టించుకోలేదు. అయితే తాజాగా ఒటీటీలో రిలీజ్ అయిన ఈ మూవీ భాగానే ఆకట్టుకుంటుంది. ఇదిలా ఉంటే నిర్మాతగా అడుగుపెట్టిన మెగాస్టార్ కూతురు సుస్మిత మొదటి ప్రయత్నంలో వెబ్ సిరీస్ చేసి సక్సెస్ అందుకుంది. అయితే ఇప్పుడు ఓ చిన్న సినిమాతో బిగ్ స్క్రీన్ పై నిర్మాతగా మొదటి ప్రయత్నం చేసింది. సంతోష్ శోభన్ హీరోగా శ్రీదేవి శోభన్ బాబు అనే సినిమాకి ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చింది. మలయాళీ హిట్ మూవీ రీమేక్ రైట్స్ సొంతం చేసుకొని మరీ ఈ మూవీని తెరకెక్కించారు. ఇదిలా ఉంటే శివరాత్రి సందర్భంగా ప్రేక్షకుల ముందుకి వచ్చిన ఈ మూవీ డిజాస్టర్ టాక్ సొంతం చేసుకుంది.శివరాత్రికి దీంతో పాటు వచ్చిన సార్ వినరో భాగ్యము విష్ణు కథ మూవీస్ పాజిటివ్ టాక్ తెచ్చుకోగా శ్రీదేవి శోభన్ బాబు మాత్రం రొటీన్ కథతో ప్రేక్షకులని మెప్పించలేకపోయింది. ఇంచుమించు నాగార్జున నిన్నే పెళ్ళాడతా తరహాలో ఈ మూవీ కథ ఉంటుందని తెలుస్తుంది. ఇలాంటి రెండు కుటుంబాలు విడిపోవడం వారిని హీరో హీరోయిన్స్ కలపడం అనే స్లాట్ ఇప్పటికే వందల సినిమాలు తెలుగులో వచ్చాయి. మళ్ళీ అదే తరహా కథతో వచ్చిన శ్రీదేవి శోభన్ బాబులో ఎలాంటి కొత్తదనం లేకపోవడంతో డిజాస్టర్ లోకి వెళ్ళిపోయింది. దీంతో సుస్మిత నిర్మాతగా మొదటి సినిమాతోనే ఫెయిల్యూర్ ని ఖాతాలో వేసుకుంది అనే మాట వినిపిస్తుంది.








# గిల్‌కు అంత సీన్ లేదు.. ప్రపంచ క్రికెట్‌ను శాసించబోయేది అతడే..!





అవకాశం దొరికితే టీమిండియా ఆటగాళ్లపై బురదజల్లేందుకు పాకిస్తాన్, ఆస్ట్రేలియా మాజీలు, ఆ రెండు జట్ల అభిమానులు రెడీగా ఉంటారన్న విషయం ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.ఈ రెండు దేశాలకు చెందిన వారు భారత ఆటగాళ్లపై అక్కసు వెళ్లగక్కి, విషం చిమ్మే అవకాశం ఎప్పుడెప్పుడు వస్తుందా అని గోతికాడి నక్కల్లా ఎదురు చూస్తూ ఉంటారు. సాధారణంగా ఇలాంటి వారికి అవకాశం ఇ?వ్వకుండా మనవాళ్లు ఆన్ ఫీల్డ్, ఆఫ్ ద ఫీల్డ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే ఇలాంటి అవకాశం ఎప్పుడోసారి దొరికితే మాత్రం ఈ రెండు దేశాలకు చెందిన వారు పండుగ చేసుకుంటారు.తాజాగా ఇలాంటి ఓ అవకాశమే ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు దొరికింది. ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్‌ఫోలో ఓ సందర్భంగా భవిష్యత్తు క్రికెట్ సూపర్ స్టార్ ఎవరు అనే ప్రశ్నను నిర్వాహకులు స్మిత్‌ను అడిగారు. ఈ ప్రశ్నకు వారు టీమిండియా శుభ్‌మన్ గిల్, ఇంగ్లండ్ యువ కెరటం? హ్యారీ బ్రూక్స్ అనే రెండు ఆప్షన్స్ కూడా ఇచ్చారు. టీమిండియా ఆటగాళ్లను తక్కువ చేసి చూపే ఇలాంటి ఓ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న స్మిత్‌కు ఈ ప్రశ్న రూపంలో బంపరాఫర్ వచ్చింది.ఈ ప్రశ్న సంధించగానే ఏమాత్రం తడుంకోని స్మిత్, రెండో ఆప్షన్ లేదు అన్నట్లుగా ఠక్కున హ్యారీ బ్రూక్ పేరు చెప్పాడు. 23 ఏళ్ల హ్యారీ బ్రూకే భవిష్యత్తు సూపర్ స్టార్ అని కితాబునిచ్చాడు. టీమిండియా శుభ్‌మన్ గిల్‌తో పోలిస్తే బ్రూక్ అన్ని విభాగాల్లో మెరుగ్గా ఉన్నాడని కొనియాడాడు. స్మిత్ ఆన్సర్‌తో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా ఏకీభవించాడు.దీంతో స్మిత్ మరింత సౌండ్ పెంచి టెక్నిక్ విషయంలో, విదేశీ పిచ్‌లపై బ్రూక్ అద్భుతమైన ప్రదర్శనలు కనబర్చాడని పాకిస్తాన్, న్యూజిలాండ్ టూర్‌లను ఉదహరించాడు. గిల్‌కు వ్యతిరేకంగా ఓటు వేసి శునకానందం పొందుతున్న స్మిత్‌కు భారత అభిమానులు తగిన బుద్ధిచెబుతున్నారు. గతంలో కోహ్లిని, నిన్ను ఇలాగే పోల్చారు.. ఇప్పుడు కోహ్లి ఎక్కడ.. నువ్వు ఎక్కడా అంటూ గాలి తీసేస్తున్నారు.కాగా, ఫ్యూచర్ సూపర్ స్టార్ ఎవరు అనే విషయంపై ఎవరి అభిప్రాయాలు వారికున్నప్పటికీ.. గిల్, బ్రూక్ ఇద్దరు సూపర్ టాలెంటెడ్ ఆటగాళ్లన్న విషయం ఒప్పుకోవాల్సిందే. తొలుత టెస్ట్‌ల్లోనే సత్తా చాటిన గిల్ ఆ తర్వాత వన్డే, టీ20ల్లోనూ చెలరేగిపోయాడు. మూడు ఫార్మాట్లలో సెంచరీలు సాధించిన అతి కొద్దిమంది క్రికెటర్లలో గిల్ కూడా ఒకడిగా నిలిచాడు. బ్రూక్ విషయానికొస్తే.. ఇతను కూడా ఆరంగ్రేటం నుంచి ఫార్మాట్లకతీతంగా అదిరిపోయే పర్ఫామెన్స్‌తో అదరగొడుతున్నాడు. వన్డేలు, టీ20లతో పోలిస్తే బ్రూక్ టెస్ట్‌ల్లో చెలరేగిపోతున్నాడు. 8 ఇన్నింగ్స్‌లో 77.9 సగటున 3 సెంచరీలు, 3 హాఫ్ సెంచరీల సాయంతో 623 పరుగులు చేశాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190